## రాజస్థాన్ ఘటనను ఖండిస్తూ ఎన్ఎఫ్ఐడబ్ల్యు నిరసన



**ప్రజాపక్షం/హయత్ నగర్:** రాజస్థాన్‌లో 13 ఏళ్ల మైనర్ బాలికపై 35 మంది కామాంధులు సాగించిన అత్యంత పాశవిక సామూహిక అత్యాచార ఘటనను ఖండిస్తూ హయత్‌నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) హయత్‌నగర్ మండల సమితి అధ్యక్షురాలు చెంది సుమతి ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. దోషులను కఠినంగా శిక్షించాలని ప్లకార్డులతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఐ ఎల్‌బి నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ మండల ప్రధాన కార్యదర్శి కుంచాల సౌజన్య, ఆది లక్ష్మి, రాపాక సౌజన్య, చెంది రాము తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.నర్సింహ్మారెడ్డి



**ప్రజాపక్షం/కొందుర్గు:** గ్రామ పంచాయతీల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.నర్సింహ్మారెడ్డి ఆరోపించారు. బుధవారం కొందుర్గు మండల పరిషత్ కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జిపి వర్కర్స్ యూనియన్ మండల గౌరవ అధ్యక్షుడు జి.యాదయ్య, మండల అధ్యక్షుడు బి.యాదయ్య, ప్రధాన కార్యదర్శి పామిడి జంగయ్య, ఎన్.రాములు, జంగయ్య, రాములు, ఎం.శ్రీను, ఎం.రమేష్, యాదయ్య, రఫీ, సత్తయ్య, పద్మమ్మ, రంగయ్య తదితరులు పాల్గొన్నారు

## చెత్త డంపింగ్‌యార్డు కోసం రాజకీయాలకతీతంగా పోరాటం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డు కోసం రాజకీయాలు చేయడం మానుకొని పార్టీలకు అతీతంగా పోరాటం చేసేందుకు సిద్ధం కావాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి చేసిన సవాల్‌ను స్వీకరిస్తూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బుధవారం షాద్‌నగర్ ముఖ్యకూడలిలో అంబేద్కర్‌కు పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఎమ్మెల్యేకు మద్దతు తెలిపేందుకు పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఎన్ని జీవోలు వచ్చినా సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డును అడ్డుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, మండల పార్టీల అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, రాయికల్ శ్రీనివాస్, రమేష్, జాకారం శేఖర్, కుమార్ గౌడ్, శివశంకర్ గౌడ్, ఇద్రీస్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, సర్పంచులు గోపాల్‌రెడ్డి, చందునాయక్, బాబునాయక్, ఉప సర్పంచ్ అశోక్ పాల్గొన్నారు.

## సెల్ టవర్ ఏర్పాటును అడ్డుకున్న శ్రీపురం కాలనీ వాసులు



**ప్రజాపక్షం/ఎల్‌బి.నగర్ :** బియన్‌రెడ్డి నగర్ డివిజన్ సాగర్ కాంప్లెక్స్, శ్రీపురం కాలనీలో ఇంటి యజమానితో ఒప్పదం చేసుకుని ఎయిర్ సెల్ టవర్స్ నిర్మించడంపై కాలనీ వాసులు అభ్యతరం తెలిపారు. ఎయిర్‌టెల్ యజమాన్యం జోక్యం చేసుకుని సెల్ టవర్స్‌ను ఉపసవహరించుకోవాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కాల్వ శ్రీధర్‌రెడ్డి, సికిందర్‌రెడ్డి, రాజేందర్, నర్సింహారెడ్డి, వెంకటరమణ రెడ్డి, కల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, శిరీష్‌కుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములపై కాంగ్రెస్ నేతల కన్ను

మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్ పరిధి ముంగనూరు గ్రామం సర్వేనెంబర్ 44లో కబ్జాకు గురైన రూ.200 కోట్ల విలువైన 12 ఎకరాల ప్రభుత్వ భూమిపై కాంగ్రెస్ నేతల కన్నుపడ్డదని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆరోపించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని బుధవారం స్థానిక నాయకులతో కలిసి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రభుత్వ అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వ భూమిని కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు బిఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు దండెం రామ్ రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి బొక్క గౌతమ్ రెడ్డి, మోహన్ గుప్తా, ప్రభువు వర్ధన్ రెడ్డి, కళ్యాణ్ నాయక్, కాకుమాను చెన్నయ్య పాల్గొన్నారు

# ఉప్పల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి సహకరించండి

భూసేకరణ, పరిహారం, పునరావాసంపై సందేహాల నివృత్తి

టిడిఆర్ రూపంలో పరిహారం హామీ

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతిష్ఠాత్మక ఉప్పల్ గ్రేడ్ సెపరేటర్ (రామాంతపూర్ ఉప్పల్ ఫ్లైఓవర్) ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే ప్రభావిత ఆస్తి యజమానులతో సంస్థప్రధాన కార్యాలయంలో బుధవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, అదనపు కమిషనర్(పారిశుద్ధ్యం) సి.ఎన్.రఘుప్రసాద్, చీఫ్ సిటీప్లానర్ బి.ప్రదీప్ కుమార్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

### పూర్తి పారదర్శకతతో భూసేకరణ

ఈ సమావేశంలో భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపు, పునరావాస చర్యలపై ఆస్తి యజమానులు పలు సందేహాలు, అభ్యంతరాలను అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ ఆస్తి యజమానుల అభ్యంతరాలన్నింటినీ ఓర్పుతో విన్నారు. ప్రభుత్వ నిబంధనలు, చట్టపరమైన నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు ట్రాన్స్‌ఫర్ డెవప్‌మెంట్ రైట్స్(టిడిఆర్) రూపంలో పరిహారం చెల్లింపులు ఉంటాయని వారికి చెప్పారు.

### ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత విముక్తి

'ఉప్పల్ గ్రేడ్ సెపరేటర్ ప్రాజెక్టు పూర్తయితే ఉప్పల్ జంక్షన్‌లో దశాబ్దాలుగా ఉన్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ముఖ్యంగా నగర తూర్పు ప్రాంతాలకు మెరుగైన రాకపోకలు, అనుసంధానం ఏర్పడుతుంది. ప్రజాప్రయోజనార్థం చేపడుతున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు ఆస్తుల యజమానులు పూర్తి స్థాయిలో సహకరించాలి. ప్రతి దశలోనూ న్యాయబద్ధంగా, సమన్వయంతో ముందుకు సాగుతాం.' అని వినయ్ కృష్ణా రెడ్డి అన్నారు.

# 'సర్' ప్రక్రియ వేగవంతం చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అన్నారు. మలక్‌పేట్ నియోజకవర్గ పరిధిలోని చంచల్‌గూడ, చౌని ప్రాంతాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాలను కర్ణన్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చార్మినార్ జోనల్ కమిషనర్ కె.సత్యనారాయణతో కలిసి ఆయన పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో కమిషనర్ స్థానిక ప్రజలతో మాట్లాడారు. ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణి ఏ విధంగా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా నమోదు, సవరణలపై స్థానికులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేస్తూ, ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు..

క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, ఎన్నికల సంఘం (ఈసిఐ) నిర్దేశించిన మార్గదర్శకాలను అధికారులు ఖచ్చితంగా పాటించాలని కర్ణన్ స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా కేటాయించిన పనులన్నింటిని పూర్తి చేయాలన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పారదర్శకంగా సేవలు అందించాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు (ఎఈఆర్ఓలు), బిఎల్ఓ సూపర్‌వైజర్లు, బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓలు), బూత్ లెవెల్ ఏజెంట్లకు (బిఎల్ఎలు) ఆయన కీలకఆదేశాలు జారీ చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలపై.. సచివాలయంలో ఎఐటియుసి వినతి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా నగర పాలక సంస్థల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షుడు కె.ఏసురత్నం, ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూనియన్ రాష్ట్ర నాయకులు బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఎంఎయుడి ముఖ్య కార్యదర్శి టి.కె.శ్రీదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీలలో పనిచేస్తూ మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి, అలాగే 60 సంవత్సరాలు నిండిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు వారసత్వ ఉద్యోగాలు కల్పించాలనే ఫైల్ గత డిసెంబర్ నుండి పెండింగ్‌లో ఉండటంపై యూనియన్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈవిషయమై సెక్షన్ ఆఫీసర్ అంజప్ప రెండు, మూడు రోజుల్లోగా ఈ ఫైల్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖ ఆమోదం కోసం పంపుతామని ఆయన హామీ ఇచ్చారన్నారు.

## 'ఫ్యూచర్ సిటీ' భూసేకరణకు మేడిపల్లి గ్రామస్తుల సమ్మతి

పరిహారంపై అంగీకారం తెలుపుతూ

సమ్మతి పత్రాలు అందజేత



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఫ్యూచర్ సిటీకి అనుసంధానంగా నిర్మించనున్న రహదారికి అవసరమైన భూసేకరణ ప్రక్రియలో భాగంగా బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ)ఛాంబర్‌లో రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి గ్రామస్తులతో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కె చంద్రారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణ ప్రక్రియ,పరిహారం చెల్లింపు,ప్రభుత్వ నిబంధనలు,రైతులకు కల్పించబడుతున్న ప్రయోజనాల పై గ్రామస్తులకు సమగ్రంగా వివరించారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయి.ప్రభుత్వం ప్రకటించిన పరిహారంపై గ్రామస్తులు అంగీకారం వ్యక్తం చేస్తూ తమ సమ్మతి పత్రాలను (కాన్సెంట్ పిటిషన్స్)అదనపు కలెక్టర్‌కు అందజేశారు.భూసేకరణ ప్రక్రియను పరస్పర అవగాహనతో,పారదర్శకంగా,వేగవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన గ్రామస్తులకు అదనపు కలెక్టర్ అభినందనలు తెలియజేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత రెవెన్యూ అధికారులు, భూసేకరణ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రద్దీ నివారణకు కార్యాచరణ

సైబరాబాద్ జాయింట్ సిపి(ట్రాఫిక్)- సన్ ప్రీత్ సింగ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ట్రాఫిక్ రద్దీ నివారణకు సమగ్ర సర్వేలు నిర్వహించి, ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. బుధవారం సైబరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు డేటా ఆధారిత కార్యాచరణ రూపొందించే లక్ష్యంతో, శేరిలింగంపల్లి ట్రాఫిక్ జోన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలతో సైబరాబాద్ జాయింట్ సిపి(ట్రాఫిక్) సన్ ప్రీత్ సింగ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో జాయింట్ సి పి సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు సమగ్ర డేటా ఆధారిత సర్వేలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రదానంగా వివిధ కంపెనీల నుంచి ఏయే సమయాల్లో ఎన్ని వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయనే అంశాలపై వారం రోజుల పాటు రోజువారీగా, సమయాల వారీగా వాహనాల లెక్కింపు (వెహికల్ కౌంటింగ్) చేపట్టాలని ఆదేశించారు. ఈ సర్వే ద్వారా ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్‌లో ట్రాఫిక్ తీవ్రతపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. ముఖ్యంగా ఐటీ కారిడార్ ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులు కార్‌పూలింగ్‌ను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వాహనాల వర్గీకరణ(వెహికల్ క్లాసిఫికేషన్), ట్రాఫిక్ వాల్యూం, రహదారుల సామర్థ్యంపై సమగ్ర విశ్లేషణ నిర్వహించాలని అధికారులకు తెలిపారు. ప్రధాన కూడళ్లు (జంక్షన్లు), ముఖ్య రహదారుల్లో ఏర్పాటు చేసిన సిసి టివి కెమెరాల పనితీరును సమీక్షించి, అవి సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా పరిశీలించాలని సూచించారు. షాపింగ్ మాల్స్, హోటళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థల వద్ద ట్రాఫిక్ పరిస్థితులను అధ్యయనం చేసి, రద్దీ సమయాల్లో ట్రాఫిక్‌ను సాఫీగా సాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యాసంస్థల ప్రారంభ, ముగింపు సమయాల్లో విద్యార్థులు ఏ విధంగా ప్రయాణిస్తున్నారు,ట్రాఫిక్‌పై దాని ప్రభావం ఎలా ఉందనే అంశాలను విశ్లేషించాలని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో శేరిలింగంపల్లి ట్రాఫిక్ డిసిపి రవి కుమార్,శేరిలింగంపల్లి ట్రాఫిక్ అడిషనల్ డిసిపి హనుమంతరావు, అడిషనల్ డిసిపి ట్రాఫిక్ అడ్మిన్ నరేందర్, ఎస్సి ఎస్సి సిఐఆ నవేద్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### సిఎం పర్యటనకు ఏర్పాట్లు



సిఎం పర్యటన నేపథ్యంలో బందోబస్తుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపూర్ గ్రామంలో నిర్వహించనున్న ప్రీమియర్ ఎనర్జీస్ సోలార్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సిఎం హాజరుకానున్న సందర్భంగా చేపట్టనున్న బందోబస్తు ఏర్పాట్లపై ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి, జాయింట్ సిపి చందనా దీప్తితో కలిసి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో చేవెళ్ల జోన్ డిసిపి యోగేష్ గౌతమ్, ఎసిపి బి.కిషన్, షాబాద్ ఎస్‌హెచ్‌ఒబి ఎం.భూపాల్, శ్రీధర్, పోలీస్ శాఖకు చెందిన ఇతర అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పేద ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు వైఎస్ఆర్

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పేద ప్రజల గుండెల్లో చిర స్మరణీయుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ముఖ్య కూడలిలో వైఎస్ఆర్ 77వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, మైనార్టీ నేత మహ్మద్ ఇబ్రహీంల ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్, నేతలు బాల్‌రాజ్ గౌడ్, రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, శ్రీనివాస్ యాదవ్, బీసిసేన అసెంబ్లీ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు కొప్పునూరి ప్రవీణ్, దిలీప్, లింగారెడ్డిగూడ ఉపసర్పంచ్ అశోక్, సీ తారాములు, గంగనమోని సత్తయ్య, శేఖర్ పాల్గొన్నారు.



**హయత్ నగర్ :** రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా కొత్తపేట చౌరస్తాలో యువజన పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తపేట మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ గౌడ్ , కొత్తపేట చైతన్యపురి డివిజన్ పార్టీ అధ్యక్షుడు లింగాల కిషోర్, చైతన్యపురి అధ్యక్షులు శశిధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మద్దుల వెంకటేశ్వర్ యాదవ్, కరీం, జహంగీర్ బాబు గౌడ్, దాము మహేందర్, రజిని, కొమ్ము యాదగిరి, తావుల పాల్గొన్నారు.

**ఎల్‌బి నగర్ :** రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా హస్తినాపురం డివిజన్‌లోని డిఆర్‌డిఎల్ కాలనీ(వైఎస్సార్ చౌరస్తా) వద్ద రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దెంది శశిధర్‌రెడ్డి, నరసింహగౌడ్, షాకిర్, మేడి మహేష్, చంద్రశేఖర్‌రెడ్డి, సాయిరాంరెడ్డి, మల్లేష్, దుర్గా శ్రీను, శ్రీకాంత్‌రెడ్డి, బ్రహ్మచారి, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఫరూఖ్‌నగర్:** రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి నేత శీలం శ్రీను, పత్తి సంతోష్, ఈదులపల్లి నర్సింహా, బైరంపల్లి ఉప సర్పంచ్ కుంటోళ్ల నరేష్, బిక్షపతి, ప్రవీణ్, నరహరి యాదవ్, రమణారెడ్డి, చెన్నయ్యగౌడ్, ప్రకాష్, కొంకళ్ళ నర్సింహాలు తదితరులు పాల్గొన్నారు.



**యాచారం :** మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వైయస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోటే శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మేడిపల్లి గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్, ఉప సర్పంచ్ దెంది మధుకర్ రెడ్డి, అడాల గణేశ్, కందుకూరి బాలరాజ్, కాస ఎట్టయ్య, ప్రకాశ్, మక్కపల్లి మహెశ్ పాల్గొన్నారు.

# పెండింగ్ ఫీజులివ్వకపోతే తిరుగుబాటే

**● విద్యార్థుల సహనాన్ని పరీక్షించొద్దు ● 'తిరుగుబాటు' ప్రదర్శనలో ఎంపి ఆర్.కృష్ణయ్య**




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఉమ్మడి ఎపిలోని గత ముఖ్యమంత్రులంతా పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కొత్త స్కీములు పెట్టి చరిత్రకెక్కారని, కానీ ప్రస్తుత తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ఫీజుల రీయింబర్స్‌మెంట్‌ను ఎత్తేసేందుకు కుట్ర పనుతున్నారని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. ఫీజుల రీయింబర్స్‌మెంట్ స్కీంతో బడుగు, బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాస్యంతో వారి జీవితాల్లో గుణాత్మక మార్పు వచ్చిందన్నారు. అలాంటి స్కీంకు బడ్జెట్ లేదనటం, గురుకులాలు రద్దు చేస్తామనటం, ప్రభుత్వ బడులను తగ్గిస్తామంటూ పేద విద్యార్థుల విద్య పట్ల సిఎం రేవంత్‌రెడ్డి వ్యతిరేక చర్యలకు పాల్పడటం తీవ్ర ప్రజా వ్యతిరేక చర్యేనన్నారు. రాష్ట్రంలోని 14 లక్షల మంది కాలేజీ విద్యార్థులకు ఫీజుల బకాయిలు రూ.8వేల కోట్లు విడుదల చేయాలని, ఫీజుల స్కీంను యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీశ్, యువజన సంఘం అధ్యక్షులు జిల్లపల్లి అంజి ఆధ్వర్యంలో బుధవారం వేలాది మంది విద్యార్థులు హిమాయత్‌నగర్ నుంచి బషీర్‌బాగ్ చౌరస్తా బాబు జగ్జీవన్‌రావ్ విగ్రహం వరకు ''తిరుగుబాటు ప్రదర్శన'' నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఫీజుల బకాయిలు విడుదల చేయకపోతే బిసిల తిరుగుబాటు తప్పదన్నారు. బిసిలకు ఇప్పటికే అన్ని రంగాల్లో అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఫీజుల స్కీంకు బడ్జెట్ ఇవ్వకుండా ముఖ్యమంత్రి పేద కులాల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసిస్తే ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు.
విద్యార్థుల సహనాన్ని పరీక్షించొద్దని, ఫీజుల బకాయిలన్నీ విడుదల చేయకపోతే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని కృష్ణయ్య హెచ్చరించారు. సమావేశంలో సంఘం నేతలు నీలం వెంకటేశ్, అనంతయ్య, మోదీ రాందేవ్, భీంరాజు, బాలయ్య, నిఖిల్ పటేల్, శివ కుమార్, వంశీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.


# విద్యుత్ అంతరాయానికి చెక్

**● 10 రోజుల్లో ట్రీ ట్రీమింగ్ పూర్తి చేయాలి ● క్యూర్ పరిధిలో సమగ్ర కార్యాచరణ ● టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్ స్పష్టం**

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ :** విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నిరోధించేందుకు టిజిఎస్‌పిడిసిఎల్ సమగ్ర కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నదని.. ఈ క్రమంలోనే ట్రీ ట్రిమ్మింగ్, యూజీ ట్రెంచ్ పునరుద్ధరణ, డిటిఆర్ మ్యాపింగ్ పనులను వేగవంతం చేయాలి టిజిఎస్‌పిడిసిఎల్ సీఎండీ జితేష్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వర్షాకాలంలో విద్యుత్ సరఫరా అంతరాయాలు లేకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించేందుకు చేపడుతున్న ప్రత్యేక కార్యాచరణపై సిఎండి జితేష్ పాటిల్ బుధవారం క్యూర్ రీజియన్ పరిధిలోని ముఖ్య అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్యూర్ రీజియన్ పరిధిలోని చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు (ట్రీ ట్రిమ్మింగ్) కార్యక్రమాన్ని అత్యవసర ప్రాతిపదికన చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో చెట్ల కొమ్మల తొలగింపు పనులు 24 గంటల్లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లతో సమన్వయం చేసుకుని తొలగించిన చెట్ల కొమ్మలను నిల్వ చేసేందుకు తగిన డంపింగ్ ప్రదేశాల ను గుర్తించాలని సూచించారు. రహదారులపై చెట్ల కొమ్మలు పేరుకుపోకుండా వెంటనే దం పింగ్ యార్డులకు తరలించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లైన్ క్లియరెన్స్ కార్యక్రమాలకు ముందు విద్యుత్ శాఖ అధికారులు మున్సిపల్ శాఖలతో ఒక రోజు ముందుగానే సమన్వయం చేసుకుని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. క్యూర్ రీజియన్ పరిధిలో ట్రీ ట్రిమ్మింగ్, లైన్ క్లియరెన్స్ కార్యక్రమాలను రా బోయే పది రోజుల్లో పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అండర్ గ్రౌండ్ (యూజీ) కేబుల్ పనుల అనంతరం చేపట్టాల్సిన ట్రెంచ్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి ప్రజల కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల ని తెలిపారు. తవ్వకాల అనంతరం రోడ్ల పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల (డీటీఆర్) నంబరింగ్, కన్స్యూమర్ మ్యాపింగ్ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని సూ చించారు. క్యూర్ రీజియన్ పరిధిలో ఇప్పటికే 90 శాతం డీటీఆర్ మ్యాపింగ్ పూర్తయిందని అధికారులు సిఎండికి వివరించగా, మిగిలిన పనులను కూడా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. డిటిఆర్ల పరిశుభ్రత, నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి డిటిఆర్ వద్ద పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిటిఆర్ల ఎర్తింగ్ వ్యవస్థలను తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ నెల 10వ తేదీ తరువాత నిర్వహించే వాక్ అ లోంగ్ ది లైన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ విద్యుత్ లైన్లు, స్తంభాలు, డిటిఆర్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి లోపాలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించడం, భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచడం, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడమే కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని సిఎండి జితేష్ పాటిల్ తెలిపారు.

## బతుకమ్మకుంటలో మొసలి

**ప్రజాపక్షం/నల్లకుంట:** ఊహించని విధంగా మొసలి కనిపించడంతో స్థానికులు భయంతో వణికిపోతున్నారు. ఈ మేరకు అంబర్‌పేట్ బతుకమ్మకుంటలోని బండపై బుధవారం ఉదయం చిన్న మొసలి పిల్ల పడుకుని కనిపించింది. స్థానికంగా పనిచేసే కార్మికురాలు మొసలి పిల్లను చూసి తన సెల్ ఫోన్‌లో ఫొటో తీసింది. కొద్దిసేపటికే మెల్లగా అది కాస్త నీటిలోకి జారుకుంది. ఉదయం వాకింగ్‌కు వచ్చే వారికి ఆ కార్మికురాలు మొసలి విషయాన్ని చెప్పడంతో అందరూ విస్మయానికి గురయ్యారు. నగర నడిబొడ్డులో ఉన్న ఈ బతుకమ్మకుంటలోకి మొసలి రావడం ఏమిటని స్థానిక ప్రజలు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఎవరైనా దీన్ని తీసుకొచ్చి విడిచారా? ఇటీవల కురిసిన వర్షాలకు నీటిలో కొట్టుకొని వచ్చిందా? అంటూ వాకింగ్‌కు వచ్చిన వారంతా ఒకరికొకరు చర్చించుకున్నారు. మొసలి విషయాన్ని స్థానికులు హైడ్రా అధికారులకు చేరవేశారు.



## ఆరోగ్యసేవలో నర్సింగ్ ఆఫీసర్ల పాత్ర అత్యంత కీలకం : డాక్టర్ నరేందర్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆరోగ్య సేవల విషయంలో నర్సింగ్ ఆఫీసర్ల పాత్ర అత్యంత కీలకమని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరేందర్ కుమార్ అన్నారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) మార్గదర్శకత్వంలో అసిస్టెంట్ డైరెక్టర్ (నర్సింగ్) ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన నర్సింగ్ ఆఫీసర్లకు రాష్ట్ర స్థాయి తొలి ఇండక్షన్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ (నర్సింగ్), విద్యులత,అసిస్టెంట్ డైరెక్టర్ (నర్సింగ్) విజయ నిర్మల,చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ సుజాత (ఎంజిఎం ఆసుపత్రి), సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ శిరీష, లెక్చరర్ హారిత, నర్సింగ్ ఆఫీసర్లు రాజన్, దీపక, లక్ష్మ ణ్, రామానాయుడు, కొండల్ నాయక్, అనూరాధ, ప్రవళిక, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరేందర్ కుమార్ మాట్లాడుతూ రోగిని మొదటిసారిగా ఆహ్వానించే ఆరోగ్య సంరక్షణ నిపుణుడు నర్సింగ్ ఆఫీసరేనని, చివరి వరకు రోగి పక్కనే ఉండే వ్యక్తి కూడా నర్సింగ్ ఆఫీసరేనని అన్నారు. నూతనంగా నియమితులైన నర్సింగ్ ఆఫీసర్లు కేవలం వైద్య సేవలు అందించే ఉద్యోగులుగా కాకుండా మానవత్వం, కరుణ, ఆశలకు ప్రతినిధులుగా ఉండాలని సూచించారు. నర్సింగ్ అనేది కేవలం క్లినికల్ విధానాలకు మాత్రమే పరిమితం కాదని, సమర్థవంతమైన కమ్యూనికేషన్, భావోద్వేగ సహకారమని, వృత్తి నైపుణ్యం, జట్టుగా పని చేసేతత్వం, బాధ్యతాయుత వైఖరి అని అన్నారు. విజయ నిర్మల మాట్లాడుతూ తెలంగాణ నర్సింగ్ సేవల చరిత్రలో ప్రభుత్వ నర్సింగ్ ఆఫీసర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన తొలి నిర్మాణాత్మక ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం ఇదేనని అన్నారు. డిప్యూటీ డైరెక్టర్ (నర్సింగ్)విద్యులత మాట్లాడుతూ నర్సింగ్ అనేది కరుణ, నిజాయితీ, బాధ్యత,నిస్వార్థ సేవ అనే విలువలపై నిర్మితమైన అత్యున్నత వృత్తి అని అన్నారు. నూతనంగా నియమితులైన నర్సింగ్ ఆఫీసర్లు వృత్తి గౌరవాన్ని కాపాడుతూ, ప్రతి సందర్భంలో నైతిక ప్రమాణాలను పాటించాలని, ప్రభుత్వ సేవా నియమాలు, బాధ్యతలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

# పరిశుభ్రమైన బుద్ధనగర్

**● పచ్చదన పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరం ● ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి ఆకస్మిక తనిఖీ**





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బుద్ధనగర్ ప్రాంతంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ప్రధాన రహదారిపై పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడం, చెత్త పేరుకుపోవడంపై ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని, ప్రతిరోజూ సకాలంలో ఇంటింటా చెత్త సేకరణ చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కాలనీ రోడ్ నెంబర్ 4లో పట్టణ హరితీకరణను పరిశీలించిన కమిషనర్, ప్రతి ఇంట్లో ఉన్న ప్లాంటర్ బాక్స్‌లను సంరక్షణ, మొక్కల పెంపకంపై అర్బన్ బయోడైవర్సిటీ (యుబిడి) విభాగం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్లాంటర్ బాక్స్‌లలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా పారిశుద్ధ్య సిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు. పరిశుభ్రమైన, పర్యావరణహిత కాలనీల నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని కమిషనర్ అన్నారు.

### జీవనోపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టిసారించాలి

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) పరిధిలో అమలవుతున్న పట్టణ కమ్యూనిటీ అభివృద్ధి (యుసిడి) కార్యక్రమాలపై కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి సమీక్ష నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, బ్యాంకు అనుసంధానం, జీవనోపాధి అవకాశాల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పిఎం స్వనిధి రుణాలు అర్హులైన వీధి వ్యాపారులకు అందేలా చర్యలు తీసుకోవాలని, ఆసరా పెన్షన్ల లైవ్ ఆథెంటికేషన్, ఇందిరమ్మ చీరల పంపిణీ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పార్కుల నిర్వహణ, ప్రభుత్వ పాఠశాలల యూనిఫారాల కుట్టింపు పనులను నాణ్యతతో పూర్తి చేసి, అన్ని శాఖలు సమన్వయంతో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో యుసిడి అదనపు కమిషనర్ సి.ఎన్. రఘుప్రసాద్, పి.డి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన




**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ మేరకు మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యూసుఫ్‌గూడ మహాత్మాగాంధీ మెమోరియల్ (ఎంజిఎం) స్కూల్లో నిర్వహించిన మాదకద్రవ్యాల నిరోధక అవగాహన కార్యక్రమం మధురానగర్ సిఐ హెచ్.ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సిఐ ప్రభాకర్... మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటికి దూరంగా ఉండాల్సిన అవసరం, మాదకద్రవ్యాలకు సంబంధించిన నేరాల చట్టపరమైన పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## మాదకద్రవ్య రహిత భారతదేశం.. నిర్మాణానికి సమష్టి కృషి కీలకం




**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** మాదకద్రవ్య రహిత సమాజ స్థాపనకు చట్టాన్ని అమలు సంస్థలు, విద్యాసంస్థలు, సమాజం, పౌరులు సమన్వయంతో ముందుకు సాగాలని తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ కళాశాలలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' సమగ్ర అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు పీఐబీ, సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ విద్యాసంస్థల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి, అంబేద్కర్ విద్యాసంస్థల ఎవాల్యుయేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి, అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ మట్టా తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి తెలుగుదేశం ప్రజాపథం

**ప్రజాపక్షం/ముషీరాబాద్:** ప్రజలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, సంబంధిత అధికారులకు తెలియజేసేలా టిడిపి ముషీరాబాద్ నియోజకవర్గం ఆధ్వర్యంలో తెలుగుదేశం ప్రజాపథం కార్యక్రమానికి శ్రీకారం చేపట్టనున్నట్లు టిడిపి నాయకుడు, మాజీ కార్పొరేటర్ పలస బాల్‌రాజ్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటనలు విడుదల చేశారు. పార్టీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని జులై 9న చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి టెంపుల్ నుంచి కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు వివరించారు. స్థానిక ప్రజలకు కనీస వసతులు కల్పించడంలో నాయకులు, అధికారులు పూర్తి విఫలమయ్యారని, అభివృద్ధి పనులు పట్టించుకోని విషయాలను ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించే విధంగా కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

## ఫాతీమా కాలేజ్ కేసు విచారణ


**ప్రజాపక్షం/చార్మినార్:** సల్కం చెరువు ఎఫ్‌టిఎల్‌లో నిర్మితమైన ఫాతిమా ఒవైసీ విద్యాసంస్థ వ్యవహారం మరోమారు తెరపైకి వచ్చింది. జూలై 9న హైకోర్టులో కేసు విచారణకు వస్తున్నందున ఫాతీమా కాలేజీ వ్యవహారం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఫాతీమా కాలేజీ విషయంపై న్యాయవాది విజయ్ గోపాల్ కేసు దాఖలు చేశారు. ఈ పిటీషన్‌ను జస్టిస్ ఎన్‌వి శ్రవణ్ కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ చేపట్టింది. చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో నిర్మాణాలకు అనుమతులు ఎలా మంజూరయ్యాయి? సంబంధిత బల్దియా, నీటిపారుదల, రెవెన్యూ, విద్యాశాఖలు చట్టబద్ధంగా వ్యవహరించాయా? అనే అంశాలపై కోర్టుకు పూర్తి వివరాలు సమర్పించాలని సూచించగా.. మూడు నెలలు గడుస్తున్నా అధికారులు నివేదిక సమర్పించకపోవడంతో అప్పట్లో హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ జులై 9 లోపు పూర్తి వివరాలు సమర్పించాలని గడువు విధిస్తూ కేసు వాయిదా వేసిన విషయం విధితమే. ఈ క్రమంలోనే ఫాతీమా కాలేజీ విషయంలో వివిధ శాఖలు ఎలా స్పందించనున్నాయి? అనేది హాట్ టాపిక్‌గా మారింది.

## మందుబాబులకు జైలుశిక్ష



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కిన వారిని న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. ఈ మేరకు చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపి చిక్కిన 24 మంది వాహనదారులు మోటార్ వాహన చట్టం (డ్రంక్ అండ్ డ్రైవ్) ప్రకారం కేసులు నమోదు చేసి బుధవారం మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామని చిక్కడపల్లి ట్రాఫిక్ సిఐ కె.ఏడుకొండలు తెలిపారు. వీరిలో 14 మందికి జరిమానా, సామాజిక సేవా శిక్ష విధించబడిందని.. రెండోసారి ఈ నేరానికి పాల్పడిన 10 మందికి మూడు రోజుల జైలు శిక్ష, జరిమానా వించారని ఆయన వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి భారీ మొత్తంలో జరిమానాలు, వాహన జప్తు ఉంటుందని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో అరెస్ట్ అయిన వారి నుంచి రూ.1,42,200 జరిమానా వసూలు చేయడం జరిగిందని వివరించారు.

## బోనాల ఉత్సవాలకు ఆహ్వానం



**ప్రజాపక్షం/కార్వాన్:** నల్ల పోచమ్మదేవి.. మాతా మహంకాళి దేవి ఉమ్మడి ఆలయాల కమిటీ నటరాజ్ నగర్ సబ్జిమండి ఆధ్వర్యంలో జరిగే బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని కమిటీ అధ్యక్షుడు కట్ట లింగం తదితరులు ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్, మాజీ కార్పొరేటర్ స్వామి యాదవ్‌లను ఆహ్వానించారు. ఎంపి అసద్‌ను కలిసిన వారిలో పూజా కమిటీ సలహాదారులు, గుడుమని అశోక్ కుమార్, కట్ట శ్రీనివాస్, చింత జయరాం తదితరులు ఉన్నారు.

## ఆంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కోసం దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ :** ఉన్నత విద్య అభ్యసించడం కోసం అర్హులైన ఎస్‌సి విద్యార్థులు ఆంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయం కోసం దరఖాస్తులు చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి యు.ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ జిల్లా నివాసితులైన వారు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులని ఆయన తెలిపారు.

## ఆర్‌టిసి కార్మికులు ఐక్యం కావాలి

**కోళ్ల శంకర్‌గౌడ్ కుటుంబానికి తలసాని చెక్కు అందజేత**



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** ఆర్‌టిసిని ప్రైవేట్‌పరం చేసేందుకు ప్రభుత్వం యత్నిస్తున్నదని, ఈ క్రమంలో సంస్థ ఉద్యోగ, కార్మికులు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, ఎంఎల్‌ఎ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఎలక్ట్రికల్ బస్సులకు శిక్షణలేని ప్రైవేట్ డ్రైవర్లను నియమించుకోవడం, రెండు డిపోల ధారాదత్తం చేయడం ప్రైవేటీకరణలో భాగమేనన్నారు. ఆర్‌టిసి బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తిరుపతయ్య ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సభ జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌టిసి ఉద్యమంలో పెట్రోల్ పోసుకొని మృతిచెందిన కోళ్ల శంకర్‌గౌడ్ భార్య కోళ్ల హేమలతకు రూ.లక్షా నూట పదహారు వేలు చెక్కును తలసాని అందజేసి, మాట్లాడారు. బిఆర్‌ఎస్ హయాంలోనే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ ముగిసిందని, ఇప్పుడున్నది అపాయింట్‌మెంట్ డేనేనని తెలిపారు. కానీ, ప్రభుత్వం ఆర్‌టిసి ఎన్నికలకు, విలీనానికి ముడిపెట్టడం సరికాదన్నారు. ఆర్‌టిసి కార్మికులంతా సంఘటితమై తమ డిమాండ్‌లను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని, పేస్కేల్ అమలు చేయాలని కోరారు. శంకర్ గౌడ్ ఆశయ సాధనకు కార్మికులంతా కృషిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వందలాదిమంది ఆర్‌టిసి కార్మికులు, శంకర్‌గౌడ్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్లు ప్రారంభం




**ప్రజాపక్షం/యాకుత్‌పురా:** ఎంపి నిధులతో రెండు సాలారే మిల్లత్ వాటర్ ప్లాంట్‌లను ఎంపి అసదుద్దీన్ ఓవైసీ ప్రారంభించారు. కార్యక్రమంలో యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు



**ప్రజాపక్షం/నల్లకుంట:** సర్ ప్రక్రియలో భాగంగా గోల్‌నాకా హనుమానగర్‌లో ఓటర్లకు బుధవారం ఎన్యుమరేషన్ పత్రాలను పంపిణీ చేశారు. బిఎల్‌ఒ రవి రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పృథ్వీరాజ్ నేతృత్వంలో ఇంటింటికి వెళ్లి ఓటర్లకు పత్రాలను అందజేశారు. సందర్భంగా పృథ్వీరాజ్, దుర్గా ప్రసాద్, శ్రీధర్, శేఖర్ తదితరులు బస్తీలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసి ఓటర్లకు సంబంధించిన ఎన్యుమరేషన్ పత్రాలలో వివరాలు రాసి వారికి సహకరించారు.

## బిఎల్‌ఒలు నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బిఎల్‌ఒలు నిర్మాణాత్మకంగా వ్యవహరించి, రోజు వారీ దరఖాస్తులను తమ బూత్ అధికారులకు దాఖలు చేయాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ సూచించారు. సీతాఫలమండీలో ఓటర్ల సహాయతా కేంద్రాన్ని పద్మారావుగౌడ్ బుధవారం పరిశీలించి ఓటర్లు, బీఎల్ ఏలతో ముచ్చటించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ యువనేత కిశోర్ కుమార్, సమన్వయకర్త రాజా సుందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాటం



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** ప్రజా సమస్యలపై సమరం కొనసాగుతుందని ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ బిఆర్‌ఎస్ ఇంచార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ... వెంకటేశ్వరకాలనీ డివిజన్ గురు బ్రహ్మనగర్‌లో స్థానిక ఆయన పర్యటించగా.. స్థానికులు మూడు సంవత్సరాలుగా ఐమాక్స్ స్ట్రీట్ లైట్లు వెలగడం లేదని, సాధారణ స్ట్రీట్ లైట్లు లేవని, ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో బైకులు వేగంగా దూసుకెళ్తుండటంతో స్కూల్ విద్యార్థులు, స్థానికులకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగింది.

## నకిలీ సర్టిఫికెట్ల ముఠాకు చెక్



**ప్రజాపక్షం/ఫలక్‌నుమా:** నకిలీ సర్టిఫికెట్ల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నకిలీ విద్యా ధృవీకరణ పత్రాల (ఫేక్ సర్టిఫికేట్స్) ముఠా గుట్టును రట్టు చేస్తూ ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి అతని నుంచి 15 నకిలీ సర్టిఫికెట్లు, మొబైల్ ఫోన్, స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 7న రాత్రి 9 గంటల సమయంలో మీర్‌చౌక్ ఎస్‌ఐ సి.అనితకు ఒక వ్యక్తి నకిలీ విద్యా ధృవీకరణ పత్రాలతో చౌక్ ప్రాంతానికి రానున్నట్లు నమ్మదగిన సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి ఎతేబార్ చౌక్ వద్ద నిఘా పెట్టారు. సమాచారంలో పేర్కొన్న విధంగా నకిలీ సర్టిఫికెట్లతో వచ్చిన అబ్దుల్ రషీద్‌ఖాన్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 15 నకిలీ విద్యా ధృవీకరణ పత్రాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి పరారీలో ఉన్న ఇద్దరి కోసం గాలింపు చేపట్టారు.



## యాదగిరిగుట్ట పాలక మండలికి దిశానిర్దేశం చేసిన సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇటీవల నియమితులైన యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పాలక మండలి నూతన పాలక మండలి సభ్యులు బుధవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాలక మండలికి దేవస్థానం అభివృద్ధి, భక్తులకు మెరుగైన సేవలు, పారదర్శక పాలనపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. అలాగే పాలక మండలి ఛైర్మన్ ఎం. సత్యనారాయణ రెడ్డితో పాటు బోర్డు సభ్యులు వినోద్ వెంకటస్వామి, కొణిదెల సురేఖ, విజయ రాజం, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, డాక్టర్. మల్లయ్య, స్వాతి కాంత మనేని, ఎం. రాఘవేందర్ రావు, డాక్టర్. లక్ష్మీనారాయణ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అభివృద్ధి, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాల కల్పన, ఆధ్యాత్మిక సేవల విస్తరణ, పారదర్శక పరిపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి పాలక మండలి సభ్యులకు సూచించినట్లు తెలిసింది.

## సిఎం రేవంత్‌రెడ్డితో గ్రీన్ గ్రోత్ సమ్మిట్ ప్రతినిధుల భేటీ

### తెలంగాణలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఎఐ, భవిష్యత్ అభివృద్ధిపై చర్చ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లో జరుగుతున్న గ్రీన్ గ్రోత్ ఎకనమిక్ సమ్మిట్–2026లో పాల్గొనేందుకు వచ్చిన అంతర్జాతీయ ప్రతినిధి బృందం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసింది. వివిధ దేశాలకు చెందిన ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడి అవకాశాలు, భవిష్యత్ భాగస్వామ్యాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. ఎంసిఆర్ హెచ్ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్‌లోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో మలేషియా పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ ఎం.శరవణన్, బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ బోర్డు డైరెక్టర్ నిలి గిల్బర్ట్, అమెరికా వాణిజ్య శాఖ మూమెంటమ్ టెక్నాలజీస్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు మహేష్ కొందూరు, ఓక్సన్ టెక్నాలజీస్, గ్లోబల్ ఫ్యూచర్ కౌన్సిల్ కోఛైర్ అమిత్ మెహ్రా, నార్వే ప్రభుత్వ మాజీ స్టేట్ సెక్రటరీ దిలెక్ అయహన్, దక్షిణాఫ్రికా పార్లమెంట్ సభ్యుడు థామస్ ప్రొలిక్, సిలోన్ వర్కర్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు సెంథిల్ థండమాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ, సామాజిక, పరిపాలనా (ఇఎస్‌జి) అంశాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కృత్రిమ మేధ (ఎఐ) వినియోగం, సుస్థిర అభివృద్ధి, భవిష్యత్ పెట్టుబడుల అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో గ్రీన్ గ్రోత్ ఎకనమిక్ సమ్మిట్ నిర్వాహక సంస్థ మెరీడియన్ కలెక్టివ్ ప్రతినిధులు రిత్వికా భట్టాచార్య, ఉమా భట్టాచార్యతో పాటు లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## బల్కంపేట ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు సర్వం సిద్ధం..

### భక్తులకు అసౌకర్యం లేకుండా ఘన ఏర్పాట్లు చేయాలి

### మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బల్కంపేట శ్రీ ఎల్లమ్మ అమ్మవారి ఆషాఢ బోనాల ఉత్సవాలు, వార్షిక కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత, తాగునీరు, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బల్కంపేటలో బుధవారం నిర్వహించిన ఆషాఢ బోనాల ఉత్సవాలు, ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవ సమన్వయ సమావేశంలో మంత్రి కొండా సురేఖ పాల్గొని అధికారులతో ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆషాఢ బోనాల జాతర, కళ్యాణోత్సవ పోస్టర్లను అధికారులతో కలిసి ఆవిష్కరించారు.





తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమ కమిటీ ఛైర్మన్ కె.కేశవరావును బుధవారం ఉదయం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో టిజెఎఫ్ అధ్యక్షులు పల్లె రవికుమార్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు కలిశారు. కమిటీ ఛైర్మన్‌కు జర్నలిస్టులు, ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమంపై ఒక సమగ్ర వినతి పత్రాన్ని అందజేశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ కేసుపై నేడు విచారణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంజనీరింగ్ కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన జీవోల చట్టబద్ధతను సవాలు చేసిన పిటిషన్లు, మధ్యంతర ఉత్తర్వులను సవరించాలని ప్రభుత్వం దాఖలు చేసిన వెకేషన్ పిటిషన్‌పై హైకోర్టు గురువారం విచారణ చేపట్టనుంది. ఈ నెల 10 నుంచి ఇంజనీరింగ్ అడ్మిషన్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో జస్టిస్ జువ్వాడి శ్రీదేవి విచారణను గురువారానికి వాయిదా వేశారు. ప్రభుత్వం ఫీజులను నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తామని, ఆ తర్వాత కళాశాలలు వాటిని వసూలు చేసుకోవచ్చని తెలిపింది. దీనిని పిటిషనర్ల న్యాయవాదులు వ్యతిరేకిస్తూ, గత బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం హామీ ఇవ్వడం లేదన్నారు. తొలి విడత అడ్మిషన్లకు అవసరమైన నిధులు విడుదల చేస్తామని ప్రభుత్వం కోర్టుకు వెల్లడించింది. ఇరు పక్షాల వాదనలు నమోదు చేసిన న్యాయస్థానం విచారణను గురువారానికి వాయిదా వేసింది.

## ఇహెచ్‌ఎస్ కోతపై వివరణివ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) కోసం ఉద్యోగుల వేతనాలు, పెన్షనర్ల పెన్షన్ల నుంచి 1.5 శాతం కోత విధించే నిర్ణయంపై పూర్తి వివరణ ఇవ్వాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈహెచ్ఎస్ కోసం బేసిక్ పేలో 1.5 శాతం కోత విధిస్తూ జారీ చేసిన జీవోలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లో, ఇప్పటికే మెడికల్ రీయింబర్స్‌మెంట్ పథకం అమల్లో ఉండగా అదనపు కోత విధించడం నిబంధనలకు విరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు.

## కళ్యాణలక్ష్మి ,షాదీ ముబారక్ వివరాలివ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కళ్యణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాల అమలుకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. 2014 నుంచి ఈ పథకాలకు సంబంధించిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లో రూ.13 వేల కోట్లకు పైగా వ్యయం జరిగిందని, అనర్హులకు కూడా లబ్ధి చేకూరినట్లు ఆరోపణలు ఉన్నాయని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం మాత్రం నిధుల కొరత లేదని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ వర్గాల సంక్షేమం కోసం పథకాలు కొనసాగుతున్నాయని తెలిపింది. ప్రజాధన వినియోగంలో ప్రాధాన్యత అవసరమని వ్యాఖ్యానించిన కోర్టు, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

## సత్తుపల్లి బ్లాక్ -3 బొగ్గు గనిని సింగరేణి కాలరీస్‌కు కేటాయించాలి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఇంధన భద్రత, సింగరేణి భవిష్యత్ విస్తరణ దృష్ట్యా సత్తుపల్లి బ్లాక్3 బొగ్గు గనిని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటె(ఎస్‌సిసిఎల్)కు కేటాయించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం ఆయన కేంద్ర మంత్రికి లేఖ రాశారు.ఇటీవల తాడిచర్ల–2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వాగతించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అదే స్ఫూర్తితో సత్తుపల్లి బ్లాక్–3ను కూడా సింగరేణికి కేటాయించేలా చొరవ తీసుకోవాలని కోరారు. సింగరేణి ప్రస్తుతం నిర్వహిస్తున్న గనులకు ఆనుకుని ఉన్న సత్తుపల్లి బ్లాక్–3ను 16వ విడత బొగ్గు గనుల వేలంలో ఓ ప్రైవేట్ సంస్థ దక్కించుకున్నప్పటికీ, 2024 జనవరిలో ఒప్పందం కుదిరిన తర్వాత కూడా ఇప్పటివరకు మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభం కాలేదని వివరించారు. స్వతంత్రంగా గనిని అభివృద్ధి చేయడంలో ఆ సంస్థ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. సత్తుపల్లి బ్లాక్–3ను సింగరేణికి కేటాయిస్తే ఇప్పటికే ఉన్న కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, రైల్వే సైడింగ్, టౌన్‌షిప్ తదితర మౌలిక సదుపాయాలను వినియోగించుకుని తక్కువ సమయంలోనే బొగ్గు తవ్వకాలు ప్రారంభించే అవకాశం ఉంటుందని తెలిపారు. అదనపు భూసేకరణ అవసరం తగ్గడంతో పాటు పర్యావరణంపై ప్రభావం కూడా తగ్గడంతో పాటు ఆనుకుని ఉన్న బొగ్గు నిల్వలను పూర్తిస్థాయిలో వినియోగించుకునే అవకాశం కలుగుతుందని వివరించారు.ఈ నిర్ణయం దేశ ఇంధన భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు తెలంగాణ ఆర్థికాభివృద్ధికి, సింగరేణి సంస్థ భవిష్యత్ విస్తరణకు కీలకంగా ఉపయోగపడుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సత్తుపల్లి బ్లాక్–3ను సింగరేణికి కేటాయించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డిని కోరారు.

## పాంరెడ్డిపల్లి కెజిబివి విద్యార్థినుల సమస్యలు పరిష్కరించాలి

### సిఎం రేవంత్‌రెడ్డి సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వనపర్తి జిల్లా అమరచింత మండలం పాంరెడ్డిపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి), జూనియర్ కళాశాలలో చదువుతున్న 400 మంది విద్యార్థినులు కనీస సౌకర్యాలు కూడ లేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే సమస్యలను పరిష్కరించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరక బుధవారం ఆయన సిఎంకు లేఖ రాశారు. పాఠశాలలో తీవ్రమైన తాగునీటి సమస్య నెలకొందని, బోరు నీరు సరిపోక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని, వాటర్ ఫిల్టర్ ఉన్నప్పటికీ అది పనిచేయకపోవడంతో బోరు నీటినే తాగాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు.విద్యాసంస్థలో మొత్తం కాంట్రాక్టు లెక్చరర్లే బోధన నిర్వహిస్తున్నారని, వారికి ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనం కూడా అమలు కావడం లేదని తెలిపారు. పాఠశాల లెక్చరర్లకు రూ.26 వేలే, జూనియర్ కళాశాల లెక్చరర్లకు రూ.29,700 మాత్రమే చెల్లిస్తున్నారని, వెంటనే వేతనాలు పెంచాలని కోరారు.పాఠశాల, కళాశాలకు మొత్తం ఆరుగురు వర్కర్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఇద్దరే పనిచేస్తున్నారని, వారికి కేవలం రూ.9 వేల వేతనం మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. అదనంగా నలుగురు వర్కర్లను నియమించి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యార్థినులకు బకెట్లు, జగ్గులు, ప్లేట్లు, దుస్తులు, బ్లాంకెట్లు ఇప్పటికీ అందలేదని, క్రీడా సామగ్రి, ల్యాబ్‌లు, కంప్యూటర్ సౌకర్యాలు కూడా లేవని తెలిపారు. మంచాలు, ఫ్యాన్లు లేక నేలపైనే నిద్రిస్తున్నారని, వెంటనే అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.



## తెలంగాణలో సాగునీటి, రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై కేంద్రంతో సమీక్ష

### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న సాగునీటి, రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై బుధవారం కేంద్రంతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. మనోజ్ గోవిల్ అధ్యక్షతన భారత ప్రభుత్వ క్యాబినెట్ సచివాలయం నుంచి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణలో అమలవుతున్న కీలక సాగునీటి, రైల్వే ప్రాజెక్టుల పనుల పురోగతిని సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో వేగంగా పరిష్కరించి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసే అంశంపై చర్చించారు. రాష్ట్ర రవాణా, రోడ్లు–భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సాగునీటి శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్తో,ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధిలో క్రైస్తవ సమాజం సేవలు ప్రశంసనీయం

### మంత్రి అజారుద్దీన్



ప్రజాపక్షం/హైదరాబాద్: విద్యా రంగంతో పాటు దేశాభివృద్ధిలో క్రైస్తవ సమాజం చేసిన సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర మైనారిటీల సంక్షేమ, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ పేర్కొన్నారు. దళిత క్రైస్తవులకు షెడ్యూల్ కులాల (ఎస్‌సి) హోదా కల్పించాలని కోరుతూ బేగంపేట టూరిజం ప్లాజాలో బుధవారం నిర్వహించిన సమావేశంలో తెలంగాణ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ (టిసిజెఎసి) ప్రతినిధులు మంత్రులు అజారుద్దీన్, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లకు వినతిపత్రాన్ని సమర్పించారు. రాజ్యాంగంలోని షెడ్యూల్ కులాల ఆర్డర్1950లోని పేరా3లో ఉన్న మత ఆధారిత పరిమితిని తొలగించి, మతాన్ని కాకుండా కుల ఆధారిత సామాజిక వివక్ష, వెనుకబాటుతనాన్ని పరిగణనలోకి తీసుకుని ఎస్‌సి హోదా నిర్ణయించేలా కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం సిఫారసు చేయాలని టిసిజెఎసి ప్రతినిధులు కోరారు. క్రైస్తవ మతాన్ని స్వీకరించిన తర్వాత కూడా అనేక మంది దళిత క్రైస్తవులు సామాజిక వివక్ష, వెలివేత, ఆర్థిక వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నారని, వారికి సమాన రాజ్యాంగ పరిరక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ దళిత క్రైస్తవుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కూడా వినతిపత్రంలో పేర్కొన్న అంశాలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ రెడ్డి, క్రిస్టియన్ మైనారిటీస్ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్, బిషప్ జాన్, మోహన్ బాబు తదితరులతో పాటు వివిధ జిల్లాల క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ‘డిఎస్సీ- 2003’ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం

### ఎస్‌టియు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా,ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం తరహాలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా ‘డిఎస్సీ 2003’ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) అమలు చేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియుటిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందం గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టుగజేందర్, జాక్టో కో చైర్మన్ పర్వతి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిఎస్సీ 2003 నోటిఫికేషన్ నవంబర్ 2003లో విడుదలైందని, ఎంపిక ప్రక్రియ జూలై 2004 నాటికే పూర్తయిందని, కానీ పరిపాలనా, సాంకేతిక కారణాలతో నియామక ఉత్తర్వులు నవంబర్ 2005లో జారీ చేశారని వివరించారు. దీంతో ఆ ఉపాధ్యాయులను కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్ ) పరిధిలోకి తీసుకొచ్చారన్నారు. నియామక ప్రక్రియ ‘1 సెప్టెంబర్ 2004కు ముందే ప్రారంభమైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేసేలా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిన విషయాన్ని వారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకొచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా డిఎస్సి 2003 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి, వారికి న్యాయం చేయాలని కోరారు.

## ధరణి, భూభారతిలో అవకతవకలపై సిట్ పరిధిని విస్తరించాలి

### నష్టాల్లోకి వెళ్లిన సింగరేణిని మోదీ ప్రభుత్వమే ఆదుకుంది

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో భూపరిపాలన అస్తవ్యస్తంగా మారిందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ‘ధరణి’ పోర్టల్‌లో భారీగా నకిలీ అకౌంట్లు సృష్టించబడ్డాయని, వాటిపై సమగ్ర దర్యాప్తు జరగాల్సిందేనని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ధరణిపై విచారణ జరుపుతున్న ‘సిట్’ పరిధిని వెంటనే విస్తరించాలని, ప్రస్తుతం ‘భూభారతి’లో జరుగుతున్న విచ్చలవిడి అవకతవకలపైనా సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. భూభారతి అవినీతిలో భాగస్వాములైన రాజకీయ నాయకులు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం రెండున్నరేళ్ల కాలంలోనే సుమారు 2 వేల నకిలీ అకౌంట్లు వెలుగు చూడటం తీవ్ర ఆందోళనకరమన్నారు.

**నష్టాల్లోకి వెళ్లిన సింగరేణిని మోదీ ప్రభుత్వమే ఆదుకుంది :**

గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి సంస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేసి నష్టాల్లోకి నెట్టేస్తే కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం మాత్రమే ఆ సంస్థను బలోపేతం చేస్తూ కాపాడుతోందని రాంచందర్ రావు చెప్పారు. సింగరేణి సంస్థపై వేలాది మంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నందున సింగరేణి సంస్థకు కేంద్ర ప్రభుత్వం ‘తాడిచర్ల 2’ బొగ్గు బ్లాక్‌ను కేటాయించిందన్నారు.

సుమారు 182 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్న ఈ బ్లాక్ ద్వారా సింగరేణి సంస్థకు రూ.64 వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరనుందని, దాదాపు 1,200 మంది నిరుద్యోగ యువతకు కొత్తగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన తెలిపారు. ‘తాడిచర్ల2’ బొగ్గు బ్లాక్‌ను తమ ప్రయత్నాల వల్లే సాధించుకున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకోవడం పూర్తిగా అవాస్తవమని రాంచందర్ రావు విమర్శించారు. గతంలో కేంద్రంలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి ఎందుకు కేటాయించలేకపోయారో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## భారత్‌లో మానవహక్కులపై మోదీని నిలదీయండి

### ఆస్ట్రేలియా ప్రధానమంత్రిని కోరిన ఆమ్నెస్టీ

### నేడు మెల్‌బోర్న్‌లో మైనార్టీ వివక్ష వ్యతిరేక ప్రదర్శన

**మెల్‌బోర్న్:** భారతదేశంలో మానవ హక్కుల అమలు తీరుపై చర్చల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీని నిలదీయాలని ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ ఆల్బనీస్‌ను ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ కోరింది. మూడు దేశాల పర్యటనలో భాగంగా మోదీ బుధవారం సాయంత్రం ఆస్ట్రేలియా నగరం మెల్‌బోర్న్ చేరుకున్నారు. ఆక్కడ ఆయనకోసం వేలాదిమంది ప్రజల ఘన స్వాగతాలతో పాటు నిరసన ప్రదర్శనలు కూడా ఎదురుచూస్తున్నాయి. భారత్‌లో జర్నలిస్టులు,మానవ హక్కుల సంఘాలు,స్వేచ్ఛగా ఎలాంటి బెదిరింపులు లేకుండా తమ బాధ్యతలు నిర్వర్తించేవిధంగా భరోసా కల్పించాలని ఆమ్నెస్టీ కోరింది.భారత్‌లో ప్రజలు మతం, జాతి, మైనారిటీ వివక్షలు లేకుండా నిర్భయంగా ఉండేలా ప్రోత్సహించాలని కోరింది. 2023 తర్వాత మోదీ ఆస్ట్రేలియా పర్యటన మళ్ళీ ఇదే. ప్రధానమంత్రి పదవి చేపట్టిన తర్వాత ఆస్ట్రేలియాలో ఆయనకు ఇది మూడోసారి పర్యటన. అదేవిధంగా ఒక దశాబ్దకాలం తర్వాత ఆయన మళ్ళీ మెల్‌బోర్న్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రవాసభారతీయులతో దాదాపు 20,000 మంది ఆయనకు ఒక స్టేడియంలో జరిగే కార్యక్రమంలో ఘన స్వాగతం లభిస్తుందని అంచనా. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమైన భారత్‌కు ఆస్ట్రేలియా సహజమిత్రదేశం. ఆ దేశంలో మోదీకి ఈ స్వాగతం భారత్‌కు గర్వకారణ వేడుక. అదే సమయంలో భారత్‌లో మైనార్టీలపట్ల వివక్షకు వ్యతిరేకంగా మోదీకి నిరసన తెలియజేసేందుకు ఇస్లామోఫోబియా సంఘం గురువారం సాయంత్రం నిరసన ప్రదర్శనకు సన్నద్ధమైంది.మోదీ పర్యటనకు నిరసనగా వీధుల్లో నిరసనకు దిగుతామని అలయెన్స్ ఎగినెస్ట్ ఇస్లామోఫోబియా అనే ఒక లాభాపేక్ష లేని సంస్థ ముందుగానే హెచ్చరిక చేసింది.మోదీపార్టీ హిందుత్వపార్టీ అనీ, మైనార్టీ వ్యతిరేకపార్టీ అనీ ఈ సంస్థ పేర్కొంది.

ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి,సుస్థిరత సాధన లక్ష్యంగా మహాసాగర్ ప్రణాళిక అమలుతోపాటు, ఆ దేశంతతో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంపై ఆల్బనీస్‌తో మోదీ చర్చలు జరుపుతారు. ఆల్బనీస్‌తో సంభాషణలకు,ఆస్ట్రేలియాలో ప్రవాసభారతీయులతో సమావేశానికి తాను ఎంతో ఉత్సుకతతో ఎదురుచూస్తున్నానని అక్కడకు చేరుకున్న వెంటనే మోదీ చెప్పారు.

ఆస్ట్రేలియాలో కూడా ఆయన మూడు రోజులు పర్యటిస్తారు. ఆ దేశంతో ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్య, పెట్టుబడులు, సముద్ర భద్రత వంటి విషయాలపై ఆల్బనీస్‌తో సంభాషణలు చేస్తారు. ఆస్ట్రేలియా–భారత్ మధ్య జరిగే వార్షిక నాయకుల సమావేశంలో ఇరు దేశాల ప్రధానమంత్రులూ పాల్గొంటారు.

## ముడి చమురు ధరలకు రెక్కలు

### కుదేలైన స్టాక్ మార్కెట్లు

**ముంబయి :** అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ పెరగడం, ముడి చమురు (క్రూడ్ ఆయిల్) ధరలు ఒక్కసారిగా ఎగబాకడంతో, భారత్‌సహా ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను ఎదుర్కొన్నాయి. ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి ప్రభావంతో భారత స్టాక్ మార్కెట్లు బుధవారం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బిఎస్ఇ సెన్సెక్స్ 1,677 పాయింట్లు (2.15 శాతం), ఎన్ఎస్ఇ నిఫ్టీ 516 పాయింట్లు (2.12 శాతం) పడిపోయాయి. ఈ పతనాన్ని పెట్టుబడిదారుల్లో నెలకొన్న ఆందోళనకు నిదర్శనంగా పేర్కోవచ్చు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌తో ఉన్న తాత్కాలిక ఒప్పందం ముగిసిందని ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. అదే సమయంలో హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై జరిగిన దాడులు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత పెంచాయి.

